# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 24-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ తన మొట్టమొదటి మానవ అంతరిక్ష ప్రయాణ మిషన్ గగన్‌యాన్‌కు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు.
- ❖ ప్రజల సమస్యలను లేవనెత్తడానికి చట్టసభ నిష్పాక్షిక వేదిక కావాలని కేంద్ర మంత్రి అమిత్ షా ఆకాంక్షించారు.
- ❖ గగన్‌యాన్ మిషన్‌ల కోసం పారాచూట్ ఆధారిత మొదటి ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ ను ఇస్రో విజయవంతంగా పూర్తి చేసింది.
- ❖ తూర్పు రాజస్థాన్, జమ్మూ కాశ్మీర్‌లలో అతి భారీ వర్షపాతం సూచిస్తూ.. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రెడ్ అలెర్ట్ జారీ చేసింది.

=======================

భారతదేశం తన మొట్టమొదటి మానవ అంతరిక్ష ప్రయాణ మిషన్ గగన్‌యాన్‌కు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. ఈ మిషన్‌కు ఎంపికైన గగన్‌యాత్రికులైన గ్రూప్ కెప్టెన్లు శుభాన్షు శుక్లా, ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్‌లకు ఈ రోజు న్యూఢిల్లీలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో రక్షణ మంత్రి పాల్గొని ప్రసంగించారు. గగన్‌యాన్ కేవలం సాంకేతిక విజయం మాత్రమే కాదని, భారతదేశ ప్రజల స్వావలంబన ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయమని వ్యాఖ్యానించారు. దాదాపు రెండున్నర సంవత్సరాలు పట్టే అంతరిక్ష కార్యక్రమ శిక్షణను శుభాన్షు శుక్లా కేవలం రెండున్నర నెలల్లోనే పూర్తి చేశారని ప్రశంసించారు. అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపడం ద్వారా భారత్ తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

=======================

భవిష్యత్‌లో భారత్ చేపట్టనున్న గగన్‌యాన్ ప్రాజెక్టుపై ప్రపంచం మొత్తం ఆసక్తి కనబరుస్తోందని భారత వ్యోమగామి శుభాంశు శుక్లా పేర్కొన్నారు. ఈ రోజు న్యూ ఢిల్లీలో జరిగిన గగన్‌యాత్రికుల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... గగన్‌యాన్ ప్రాజెక్టుపై ప్రపంచంలో చాలా మంది శాస్త్రవేత్తలు భాగం కావడానికి ఆసక్తి చూపిస్తున్నారన్నారు. భారత వాయు సేన నేర్పిన మెళకువల వల్లే తాను అంతరిక్ష యాత్రకు వెళ్లగలిగానని శుభాంశు శుక్లా తెలిపారు.

=======================

దేశ రాజధానిలోని ఢిల్లీ అసెంబ్లీలో రెండు రోజుల పాటు జరిగే అఖిల భారత సభాపతుల సమావేశాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈరోజు ప్రారంభించారు. కేంద్ర శాసనసభకు మొదటి భారతీయ స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికై వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ... భారతీయుల ఆకాంక్షలకు అనుగుణంగా దేశాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా నడిపేందుకు పునాది వేయడానికి విఠల్ భాయ్ తన బాధ్యతలు  నిర్వహించారని పేర్కొన్నారు. సభ గౌరవాన్ని, సభాపతి పదవి గౌరవాన్ని పెంపొందించడానికి కృషి చేయాల్సిన అవసరముందని తెలిపారు. ప్రజల సమస్యలను లేవనెత్తడానికి సభ నిష్పాక్షిక వేదిక కావాలని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

=======================

బీహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (SIR) సందర్భంగా 98.2 శాతం మంది పత్రాలు ఇప్పటికే అందాయని భారత ఎన్నికల సంఘం ఈ  రోజు వెల్లడించింది.  జూన్ 24 నుంచి ఆగస్టు 24లోపు ఈ పత్రాలు ఎన్నికల సంఘానికి చేరాయని, సగటున రోజుకు 1.64 శాతం మంది సమర్పించారని పేర్కొంది. తాజాగా ప్రచురించిన ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, క్లెయిమ్‌లు తెలియజేసేందుకు మరో ఎనిమిది రోజుల గడువు ఉందని, ముసాయిదా జాబితాలో తప్పుగా నమోదైన వివరాలను సరిచేసుకోవడానికి ఓటర్లకు ఇదే చివరి అవకాశమని భారత ఎన్నికల సంఘం తెలిపింది.

విరామం

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపటి నుండి రెండు రోజుల పాటు గుజరాత్‌లో పర్యటించనున్నారు. రేపు అహ్మదాబాద్‌లో 5 వేల 400 కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం బహిరంగ సమావేశంలో ప్రసంగిస్తారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా 100 కంటే ఎక్కువ దేశాలకు ఎగుమతి కోసం ఒక సంస్థ తయారు చేసిన గ్లోబల్ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాన్ని ప్రధానమంత్రి జెండా ఊపి ప్రారంభిస్తారు.

=======================

భారత్ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ ఆయుధ వ్యవస్థ (Integrated Air Defence Weapon System)ను పరీక్షించినట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ రోజు ప్రకటించారు. ఈ సమీకృత గగనతల రక్షణ వ్యవస్థను నిన్న అర్ధరాత్రి ఒడిశా తీరం నుంచి డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించిందని తెలిపారు. ఈ బహుళ అంచెల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలో దేశీయంగా అభివృద్ధి చేసిన క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్, అడ్వాన్స్‌డ్ వెరీ షార్ట్ రేంజి ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ మిసైల్స్, హైపవర్ లేజర్ ఆధారిత డైరెక్ట్ ఎనర్జీ వెపన్స్ ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ప్రత్యేకమైన పరీక్ష బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థ సామర్థ్యాన్ని తెలియజేసిందన్నారు. శత్రువులు ప్రయోగించే గగనతల ఆయుధాల నుంచి ఆయా ప్రాంతాల రక్షణను ఇది

బలోపేతం చేయనుందని చెబుతూ... ఈ వ్యవస్థను విజయవంతంగా అభివృద్ధి చేసిన డీఆర్డీవో, సైనిక దళాలను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

======================

గగన్‌యాన్ మిషన్‌ల కోసం పారాచూట్ ఆధారిత మొదటి ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ (IADT-01)ను ఇస్రో విజయవంతంగా పూర్తి చేసింది. వాయుసేన, నౌకాదళం, డీఆర్డీవో, కోస్ట్‌గార్డ్‌ల సంయుక్త సహకారంతో ఇస్రో ఈ పరీక్షలు చేపట్టింది. ఈ ప్రయోగంలో భాగంగా మాడ్యూల్ నమూనాను హెలికాప్టర్ సాయంతో నింగిలోకి తీసుకెళ్లి.. కిందికి జారవిడిచారు. పారాచూట్ల సాయంతో ఈ మాడ్యూల్ వేగాన్ని తగ్గించుకుంటూ.. సముద్ర జలాల్లో సురక్షితంగా దిగింది. మానవసహిత అంతరిక్ష ప్రయోగాల సమయంలో వ్యోమగాములు భూమికి సురక్షితంగా తిరిగి చేరుకోవడానికి దీన్ని ఉపయోగిస్తారు. మాడ్యూల్ భూవాతావరణంలోకి ప్రవేశించిన అనంతరం దాని వేగ నియంత్రణ, ల్యాండింగ్ విషయంలో పారాచూట్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది.

======================

వాయువ్య బంగాళాఖాతంలో ఒడిశా పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని రేపు  అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు ఉత్తరాంధ్రలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉండగా తూర్పు రాజస్థాన్, జమ్మూ కాశ్మీర్‌లలో అతి భారీ వర్షపాతం నమోదు అవుతుందని సూచిస్తూ.. భారత వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. దేశంలో నెలకొని ఉన్న వాతావరణ పరిస్థితులను ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్  శశికాంత్ మిశ్రా వివరిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

======================

కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో జరిగిన 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటర్ ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ 50 మీటర్ల రైఫిల్ త్రీ-పొజిషన్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించారు. అతను 462.5 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచారు.

======================
======================